మట్టి పరీక్ష.. పొలానికి బలం

- భూసార పరీక్షలతో సత్ఫలితాలు
- నేల భౌతిక లక్షణాలు తెలుసుకునే అవకాశం
- సాగు ఖర్చు తగ్గి అధిక దిగుబడులు సాధించవచ్చు



ముక్కపాడులో భూసార పరీక్షలు నిర్వహిస్తున్న ఆర్బీకే సిబ్బంది

ఉంగుటూరు: వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు పొందే మార్గాలు అనుసరించాలి. భూమిలో ఉన్న పోషకాలు, లోపాలు తెలుసుకుని వాటికి అనుగుణంగా పంటల సాగు, ఎరువుల వినియోగానికి భూసార పరీక్షలు ఎంతగానో దోహదపడతాయి. అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో కొంతమంది అన్నదాతలు రసాయనిక ఎరువులు, పురుగు మందులు అవసరానికి మించి వినియోగిస్తుండటంతో భూమిలో పోషకాలు నశిస్తున్నాయి. దీంతో నత్రజని తగ్గి భూమి ఉత్పాదక శక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడ పీడల ఉధృతి, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కాబట్టి భూసార పరీక్షలతో నేల భౌతిక, రసాయన లక్షణాలు తెలుసుకునేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

నమూనాల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- పంట కోత పూర్తయిన తర్వాత, వేసవిలో పంటలు లేని సమయాల్లో మట్టి నమూనాలు తీయాలి. పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తర్వాత మట్టి నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో నీడ పడే ప్రదేశాలు, చేలగట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనా తీయకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసేయాలి. వరి పొలంలో వి ఆకారంలో 15–20 సెంటీమీటర్ల లోతున పారతో గుంత తీసి పైపొర నుంచి కింది వరకూ ఒక పక్కగా మట్టిని సేకరించాలి.
- వ్యవసాయ క్షేత్రంలో జెడ్ ఆకారంలో సుమారు ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని క్వార్టరింగ్ విధానంలో బాగా కలిపి అరకేజీ బరువు వచ్చేలా తీసుకుని నీడలో ఆరబెట్టాలి.
- మట్టి బాగా ఆరిన తర్వాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట తదితర వివరాలు నమోదు చేసి పరీక్షా కేంద్రాలకు పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో ఆరు అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి అడుగుకు ఒక నమూనా తీయాలి.



మట్టి నమూనాలు సిద్ధం చేస్తున్న వీఏఏ

పోషకాల స్థాయిపై పక్కా లెక్క..

వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలలకు తరలించి వివిధ భౌతిక, రసాయన పద్ధతుల ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల ఆమ్ల, క్షార గుణాలు, ఆ నేలలో ఉన్న పోషకాల స్థాయిని విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా వేయాల్సిన పంట, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించుకునే అవకాశం కలుగుతుంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలతో ఎంతో మేలు



భూసార పరీక్షల ఆధారంగా ఏ పంటకు ఎంత మోతాదులో పోషకాలు అవసరమో తెలుస్తుంది. దీంతో భూమిలో లోపించిన పోషకాలను గుర్తించి దానికి అనుగుణంగా ఎరువులను వినియోగించడంతో పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది.

–హరీష్‌కుమార్, మండల వ్యవసాయశాఖ అధికారి

పచ్చిరొట్ట విత్తనాలతో భూమికి ప్రయోజనం



నున్న ఆర్బీకేలో రైతుకు పచ్చిరొట్ట విత్తనాల విక్రయం

నున్న(విజయవాడరూరల్): ఖరీఫ్ సీజన్‌కు ముందు వ్యవసాయ భూముల్లో పచ్చిరొట్ట విత్తనాలను జల్లడం వల్ల భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి, భూమికి ప్రయోజనం చేకూరుతుందని రూరల్ మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. నున్న, పాతపాడు గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాల విక్రయాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ రంగనాథ్‌బాబు మాట్లాడుతూ వ్యవసాయ భూముల్లో సారవంతం తగ్గిపోవడం వల్ల రైతులు ఖరీఫ్ పంట సాగచేయడానికి ముందుగా పచ్చిరొట్ట విత్తనాలను పొలాల్లో వేసి కలియదున్నాలని సూచించారు. ఎకరానికి జీలుగ, జనుము, పిల్లిపెసర 10 కిలోల విత్తనాలను జల్లడం వల్ల అవి మొలకెత్తి అడుగున్నర ఎత్తు పెరిగిన తర్వాత నీరు పెట్టి కలియదున్నాలని తెలిపారు. దీంతో కొన్ని రోజుల తర్వాత భూమిలో సేంద్రియ పదార్థం అభివృద్ధి చెందడాన్ని రైతులు గమనించవచ్చునని అన్నారు. ఖరీఫ్ సీజన్‌లో పంటను సాగు చేసిన తర్వాత పంటనాణ్యతతో పాటు దిగుబడులు రైతులు ఆశించిన మేర లభిస్తాయని చెప్పారు. విజయవాడ రూరల్ మండలానికి ప్రభుత్వం 215 క్వింటాళ్ల పచ్చిరొట్ట విత్తనాలను కేటాయించిందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు 50 శాతం సబ్సిడీపై మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో విక్రయిస్తున్నట్లు ఏఓ తెలియజేశారు.

పెట్రోలు బంకుల్లో లూజు విక్రయాలు చేయరాదు



కంకిపాడు పోలీసుస్టేషన్‌లో సూచనలు ఇస్తున్న ఎస్‌ఐ సందీప్

కంకిపాడు: పెట్రోలు బంకుల నిర్వాహకులు నిబంధనలు పాటించాలని ఎస్‌ఐ డి.సందీప్ అన్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో పెట్రోలు బంకు సిబ్బంది, వాహనదారులకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పెట్రోలు బంకులకు నోటీసులు జారీ చేశారన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నంత వరకూ పెట్రోలు బంకుల్లో లూజు విక్రయాలు జరగడానికి వీలు లేదన్నారు. ఆదేశాలు ఉల్లంఘించి పెట్రోలు, డీజిల్ బాటిల్స్‌లో నింపినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలను పాటించాలని బంకుల సిబ్బందికి సూచించారు. వాహనదారులు కూడా సహకరించాలని, ఎన్నికల నియమావళి అమలుకు తోడ్పాటునందించాలని అన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

శుభకరం.. శ్రీలలిత నామజపం



మీనాక్షి దేవికి పూజలు

విజయవాడ కల్చరల్: శ్రీ లలిత నామజపం శుభకరమని ఆధ్యాత్మిక వేత్త పసుమర్తి కామేశ్వరశర్మ అన్నారు. జయహో భారతీయం ఆధ్వర్యాన గాంధీనగర్ శివరామకృష్ణ క్షేత్రంలో మంగళవారం మీనాక్షి దేవికి మల్లెపూల అర్చన, కుబేర కుంకుమార్చన, సామూహిక లలిత సహస్రనామ జపం, శ్రీ చక్రార్చన చేశారు. కామేశ్వరశర్మ మాట్లాడుతూ సర్వశక్తివంతమైనది లలిత నామ పారాయణమన్నారు. సర్వ పాపాలు హరిస్తాయన్నారు. ముఖ్య అతిథి యాబలూరి లోకనాథశర్మ ధేటా జయహో భారతీయం ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. శ్రీ చక్రానికి అర్చన చేసిన కుంకుమ ధరిస్తే వ్యాపారం, ధనవృద్ధి, ఆరోగ్యం కలుగుతుందని తెలిపారు. నిర్వాహకులు శ్రీనివాసరెడ్డి అగస్త్య, వల్లీశ్వర్ పాల్గొన్నారు.

భక్తితో లలిత సహస్రనామ పారాయణం

వెంకట్రావ్ శంఖనాథంతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. రుత్వికులు మంగళంపల్లి సాయికుమార శర్మ, చెరువు విశ్వనాథశర్మ ఆధ్వర్యంలో సర్వాభరణ భూషితురాలైన మీనాక్షి అమ్మవారికి మల్లెపూలు, జాజులు, గులాబీలు, తులసి మారేడు, దవనం, మరువం పూజలు నిర్వహించారు. కుబేర కుంకుమ(ఆకుపచ్చని కుంకుమ) శ్రీ చక్రార్చన నిర్వహించారు. 500 మంది మహిళలు ఐదుసార్లు లలితా సహస్ర నామ పారాయణం చేశారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు



శ్రీదత్తసాయి మందిరంలో విద్యాసాయం అందజేత

మధురానగర్(విజయవాడసెంట్రల్): టెన్త్‌లో 95 శాతానికి పైగా మార్కులు సాధించిన నిరుపేద కుటుంబాల విద్యార్థులకు శ్రీదత్తసాయి మందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యాన మంగళవారం ప్రోత్సాహకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు మాట్లాడుతూ విద్యతోనే అభివృద్ధి సాధ్యమని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రోత్సాహకాలు పంపిణీ చేయాలని బాబావారు తనకు స్వప్నంలో తెలియజేశారన్నారు. తాను దాతలతో కలిసి శ్రీదత్తసాయి విద్యాసాయం పేరిట 26 మంది నిరుపేద పదో తరగతి ప్రతిభావంతులైన విద్యార్థులు ఒక్కొక్కరికి రూ. 5వేలు చొప్పున రూ. 1.30 లక్షలు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇక నుంచి ఏటా శ్రీదత్తసాయి విద్యాసాయం పేరిట పేద విద్యార్థులకు ప్రోత్సాహకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. తాము సామాజిక బాధ్యతగా ప్రారంభించిన శ్రీదత్తసాయి విద్యాసాయానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం 26 మంది విద్యార్థులతో బాబాకు ప్రత్యేక పూజలు చేయించి బాబావారి శేష వస్త్రం, రూ. 5వేలు చొప్పున నగదుతో సత్కరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వంశీపై అసత్య ప్రచారం చేస్తున్న వ్యక్తిపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్‌పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు చేసిన బొమ్ములూరు టీడీపీ నేత కొల్లి ప్రదీప్‌చందుపై హనుమాన్‌జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో ఆ పార్టీ నాయకులు మంగళవారం ఫిర్యాదు చేశారు. వల్లభనేని వంశీపై అసత్య ప్రచారాలను వాట్సాప్‌లో పోస్ట్ చేయడంతో వైఎస్సార్ సీపీ నాయకులు బడుగు శేఖర్, కుందేటి రాంబాబు, కోటా సురేష్‌లు హనుమాన్ జంక్షన్ ఎస్‌ఐ ఏడీఎల్ జనార్దన్‌ను కలిసి ఫిర్యాదు అందజేశారు. కొల్లి ప్రదీప్ చందుపై తక్షణమే కేసు నమోదు చేసి, తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అభయాంజనేయ సన్నిధిలో అన్నదానం

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి విచ్చేసి హనుమంతుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 200 మంది భక్తులకు మందలపు రాధాకృష్ణ, సులోచన అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలయ ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోరంకిలో వ్యక్తి మృతి

పెనమలూరు: పోరంకిలో వ్యక్తి గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ.రామారావు తెలిపిన వివరాల ప్రకారం పోరంకి లక్ష్మీపురంకాలనీ శ్రీసాయి టవర్స్‌లో జొన్నలగడ్డ లక్ష్మీకాంతమ్మకు భర్త లేకపోవడంతో కుమారుడు జొన్నలగడ్డ విజయ్‌కుమార్(46) వద్ద కుటుంబ సభ్యులతో ఉంటుంది. విజయ్‌కుమార్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతను నంబూరులోని ఇంజినీరింగ్ కాలేజీలో ప్రొఫెసర్‌గా పని చేస్తున్నాడు. కాగా విజయ్‌కుమార్‌కు మానసిక పరిస్థితి సరిగాలేకపోవడంతో ఒత్తిడికి గురై ఉన్నాడు. ఈ నెల 18వ తేదీన అతను గడ్డి మందు తాగాడు. ఇది గుర్తించిన తల్లి లక్ష్మీకాంతమ్మ కుటుంబసభ్యులతో కలిసి విజయ్‌కుమార్‌ను పోరంకిలో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించింది. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి అతను మృతి చెందాడు. తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

సమాజానికి అండగా ఉండాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక బాధ్యతలను పెంపొందించుకొని సమాజానికి అండగా ఉండాలని కాకరపర్తి భావనారాయణ కళాశా ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ విభాగాల ఆధ్వర్యాన విజయవాడ నగరానికి శివారు ప్రాంతంలో ఉన్న కార్నర్ స్టోన్ ఓల్డేజ్ హోమ్‌కు నిత్యావసర వస్తువుల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీవోల ఆధ్వర్యంలో విద్యార్థులు వృద్ధాశ్రమానికి వెళ్లి నిత్యావసర వస్తువులను అందజేశారు. డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిస్థితులను అవగాహన చేసుకోవాలన్నారు. విద్యార్థులు అట్టడుగువర్గాలకు అండగా ఉండాలని సూచించారు. తోటి మానవులకు సేవచేసిన వారు భగవంతుడికి సేవ చేసినట్లేనని అన్నారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు డి.వపస్‌కుమార్, ఎన్.సాంబశివరావు, జెడ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు గన్నవరంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం బుధవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకు ఆర్టీసీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల కార్యనిర్వహణ ఇంజినీర్ పి.హరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్టీసీ ఫీడర్‌లోని హరిజనవాడ, గ్యాస్ కంపెనీ ఏరియా, ఆర్టీసీ బస్టాండ్ ఏరియా, విద్యానగర్, శ్రీనగర్‌కాలనీ, తహసీల్దార్ కార్యాలయం ఏరియా, బీఎస్‌ఎన్‌ఎల్ ఆఫీస్, గాంధీబొమ్మ సెంటర్, బుద్ధవరం రోడ్డు, గౌడపేట, ఎంపీడీఓ ఆఫీస్ ఏరియా, మదర్‌థెరిస్సా కాలనీ, శ్రీమల్లికార్జున స్కూల్ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఆయా ప్రాంత విద్యుత్ వినియోగదారులు సహకరించవలసిందిగా ఆయన కోరారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఉయ్యూరు: చట్టాల ఉల్లంఘనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉయ్యూరు పట్టణ ఎస్‌ఐ గణేష్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం ఎన్నికల నియమావళి అమలు, పోలీసు చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ గణేష్‌కుమార్ మాట్లాడుతూ ఉయ్యూరులో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. జూన్ నాలుగో తేదీ వరకూ ఎన్నికల కోడ్, 144 సెక్షన్, సెక్షన్ 30 యాక్టు అమలులో ఉంటాయన్నారు. ఎక్కడ నలుగురు వ్యక్తులు గుమిగూడినా చట్ట ప్రకారం చర్యలు ఉంటాయని చెప్పారు. అనుమతులు లేకుండా బహిరంగ సభలు, సమావేశాలు, బాణాసంచా కాల్చడం, ర్యాలీలు నిర్వహించడం నిషేధమని తెలిపారు. ఎవరు చట్టాలను ఉల్లంఘించినా చర్యలు తీసుకోవడంలో వెనుకాడేది లేదని హెచ్చరించారు.

భారీవాహనాల రాకపోకలకు అడ్డుకట్ట



నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలో కోటకట్ట నుంచి వికాస్ కాలేజి రోడ్డుకు వెళ్లు భారీవాహనాల రాకపోకలను గ్రామ పంచాయతీ నిలిపివేసింది. ఈ రోడ్డులో నివసించే ప్రజానీకం అధిక సంఖ్యలో భారీవాహనాల రాకపోకలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నామని వాటిని నిలిపివేయాలని గ్రామ పంచాయతీకి విజ్ఞప్తి చేశారు. దీంతో గత నెలలో భారీవాహనాలు రాకపోకలు సాగించకుండ ఉండేందుకు గడ్డర్లు ఏర్పాటు చేశారు.

గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి సహకరించాలి



ఉంగుటూరు: రాబోయే సార్వత్రిక ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని గ్రామాల్లో ప్రశాంత వాతావరణం కల్పించేందుకు అందరూ సహకరించాలని ఆత్కూరు ఎస్‌ఐ పైడిబాబు కోరారు. పెద్ద అవుటపల్లిలో ఆత్కూరు పోలీసులు విసబుల్ పోలీసింగ్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలను పురస్కరించుకుని 144 సెక్షన్ అమలులో ఉన్నందున నలుగురు కంటే ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడి ఉండరాదని సూచించారు. రాజకీయ ప్రలోభాలకులోనై ఎవరైన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో రాహుకేతు పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో రాహుకాల సమయంలో నిర్వహించిన రాహుకేతు పూజలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పాత అన్నదాన భవనంలో రాహుకేతువులకు ఆలయ అర్చకులు పూజలు చేశారు. అనంతరం అమ్మవారి దర్శనానికి ఉభయదాతలను అనుమతించారు. మరోవైపున రాహుకాలంలో అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు చేయడానికి మహిళలు విశేషంగా తరలివచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని నటరాజస్వామి ఆలయం, సుబ్రహ్మణ్యస్వామి ఆలయం పరిసరాలలో మహిళలు రాహుకాల పూజలు చేశారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటా

మంత్రి జోగి రమేష్



పోరంకిలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెనమలూరు: వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎల్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి, ఆ పార్టీ పెనమలూరు అభ్యర్థి జోగి రమేష్ అన్నారు. పోరంకిలో మంగళవారం గ్రామ వైఎస్సార్ సీపీ నేతలతో జరిగిన ఆత్మీయ సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు పార్టీ గెలుపునకు చేసిన కృషి మరువలేనిదన్నారు. పోరంకిలో పార్టీ నాయకులకు, కార్యకర్తలకు అండగా ఉంటానని తెలిపారు. ఎన్నికల్లో పోరంకిలో పార్టీ శ్రేణులు పోరాటం చేసిన తీరును అభినందించారు. పోరంకి నా అడ్డ అని విర్రవీగిన టీడీపీ నేతలు పోలింగ్ రోజు గోడలు దూకి పోలింగ్ కేంద్రాల్లోకి రావడం సిగ్గుచేటని అన్నారు. పోరంకిలో దాదాగిరి నడవదని, పోరంకి టీడీపీ సొత్తు కాదని, గ్రామ ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలో ఉన్నాయని టీడీపీ నేతలను హెచ్చరించారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందని, జగనన్న తిరిగి సీఎం అవుతారని పెనమలూరు గడ్డపై వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తామని జోగి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి, దేవినేని గౌతమ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి



తెన్నేరు గ్రంథాలయంలో క్యారమ్స్ ఆడుతున్న విద్యార్థులు



వణుకూరు గ్రంథాలయంలో లెమన్ అండ్ స్పూన్ పోటీల్లో విద్యార్థులు



పురుషోత్తపట్నం గ్రంథాలయంలో చెస్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



వీరవల్లి గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థులు

కంకిపాడు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని తెన్నేరు గ్రంథాలయాధికారి ఎస్.సునీత అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో తెన్నేరు శాఖా గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు క్యారమ్స్, చెస్‌లో శిక్షణ, కథల పోటీలు నిర్వహించారు. సునీత మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటుగా ఆసక్తి గల రంగాలను ఎంచుకుని క్రీడల్లోనూ ప్రతిభ చాటాలన్నారు. వేసవి సెలవుల్లో నిర్వహించే విజ్ఞాన శిబిరాలతో విద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణా కార్యక్రమాలను ఆమె పర్యవేక్షించారు.

పెనమలూరు: వణుకూరు శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు పలు పోటీలను నిర్వహించామని శాఖా గ్రంథాలయ అధికారిణి భారతి తెలిపారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పుస్తక పఠనం, డ్రాయింగ్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్ ఆటల పోటీలు నిర్వహించామని అన్నారు. బుధవారం డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు భారతి తెలిపారు. కాగా పెనమలూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు యోగా, ఆటల పోటీలు నిర్వహించారు. ఈ మేరకు శాఖా గ్రంథాలయ అధికారిణి హర్షిత వివరాలు తెలుపుతూ వేసవి శిక్షణ తరగతులు విద్యార్థుల కోసం చురుకుగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, పురుషోత్తపట్నం గ్రామాల్లో ఉన్న గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. మంగళవారం పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చెస్ పోటీలను లైబ్రేరియన్ కె.కృపానందం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సును పెంచేందుకు చెస్ ఎంతగానో ఉపకరిస్తుందని అన్నారు. పోటీల వల్ల ఏకాగ్రత, మానసిక ధైర్యం కలుగుతుందని వివరించారు. ఆటల పోటీలు విద్యార్థుల ప్రతిభకు పదును పెడతాయన్నారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో విజ్ఞాన శిబిరం జరిగింది. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. విజేతలను పాఠకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

ఉయ్యూరు: వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఉయ్యూరు గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు గణితంపై శిక్షణ ఇచ్చారు. రీసోర్సు పర్సన్ మహేష్ గణితంలో మెళుకువలు నేర్పించారు. శిక్షణ తరగతులను గ్రంథాలయాధికారి బి.రమణి పర్యవేక్షించారు.

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారులకు ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వివిధ రకాల అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు లైబ్రేరియన్ స్వర్ణలత మంగళవారం తెలిపారు. కథలు చదవడం, జనరల్ నాలెడ్జ్, నృత్యాలు, చెస్, క్యారమ్స్ వంటి ఇండోర్ గేమ్స్‌పై విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నట్లు వివరించారు.

నైపుణ్యంతోపాటు నైతిక విలువలు పెంచుకోవాలి



విద్యాసాగర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రమేష్, డీన్ రాజేష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): యువత నైపుణ్యంతోపాటు నైతిక విలువలు పెంచుకోవాలని వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నంబూరు) వ్యవస్థాపకుడు వాసిరెడ్డి విద్యాసాగర్ చెప్పారు. పీబీ సిద్ధార్థ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యాన సాఫ్ట్‌వేర్ రంగంలో మనుగడ సాగించడం ఎలా అనే అంశంపై మూడు రోజుల సదస్సు సిద్ధార్థ కళాశాల ఆవరణలోని వెబ్‌నార్ హాలులో మంగళవారం ప్రారంభమైంది. విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో యువత తమలోని నైపుణ్యాలను మరింతగా పదును పెట్టుకుంటేనే రాణించగలరని చెప్పారు. జీవితంలో కూడా ఉన్నతంగా ఉండాలంటే నైతిక విలువలు చాలా ముఖ్యమన్నారు. ముంబయిలోని వేమా సోలార్ వ్యవస్థాపకుడు ఎంఎస్.రావు మాట్లాడుతూ యువత పర్యావరణ పరిరక్షణకు ఆలోచనలు చేయాలన్నారు. హైదరాబాద్‌లోని ఫిక్సటీ ఈడీక్సా సంస్థ సీఈవో మూర్తి సంజన్ మాట్లాడుతూ సమాచార విశ్లేషణ, సమాచార రక్షణ రంగంలో యువతకు ఉపాధి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయన్నారు. స్టూడెంట్ ట్రైబ్ సంస్థ వ్యవస్థాపకుడు చరణ్ లక్కరాజు మాట్లాడుతూ ప్రస్తుతం యువతకు ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నా ఉద్యోగ భద్రత లేదన్నారు. నైపుణ్య పెంపుతోనే ఉద్యోగ భద్రత లభిస్తోందన్నారు. సాదృశ్యో టెక్నాలజీస్ వ్యవస్థాపకుడు ప్రకాష్ కాజా మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో చిన్న మొదలైన సంస్థలే సాంకేతికతను వృద్ధి చేసుకుని పెద్ద సంస్థలుగా ఎదిగాయని దీంతో యువత చిన్న సంస్థల్లో వచ్చిన ఉద్యోగ అవకాశాలను కూడా అందిపుచ్చుకోవాలని చెప్పారు. సిద్ధార్థ కళాశాల డీన్ రాజేష్, ప్రిన్సిపాల్ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇలాంటి సదస్సులతో యువతకు ఉద్యోగ అవకాశాలపై అవగాహన ఏర్పడుతుందన్నారు. కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి, సదస్సు సమన్వయకర్త డాక్టర్ టీఎస్.రవికిరణ్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో మార్పులు వేగంగా వస్తున్నాయని, వాటిని అందిపుచ్చుకున్నప్పుడే యువత కలలు సాకారమవుతాయని పేర్కొన్నారు. కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.